తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT






సంపుటి: 1 సంచిక: 1 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ సోమవారం 2-9-2024 వెల: 5/రూ -





## రాయికోడ్ మండలంలో నిబంధలకు విరుద్ధంగా వెంచర్లు

**అందమైన ప్రకటనలు.. ఆకర్షించే బ్రోచర్లు..**

- మరింత ఆకర్షించడానికి సినియాక్టర్లతో వెంచర్లు ప్రారంభం.
- గతంలో వెంచర్ నిర్వహకులతో చేతులు కలిపిన పంచాయతీ కార్యదర్శి.
- కొనుగోలు దారులను మోసం చేయడానికి సిద్ధమైన వెంచర్ నిర్వాహకులు.
- గలికొదిలేసిన ప్రభుత్వ నిబంధనలు.
- ప్రభుత్వ ఆదాయనికి గండి కొడుతున్న కేటుగాళ్ళు.
- మామూళ్ళ మత్తు లో తూగుతున్న అధికార యంత్రంగం.




సంగారెడ్డి, సెప్టెంబర్ 1 (డైలీ రిపోర్ట్)

**సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలోని రాయికోడ్ మండలం జాంబ్గి (కె) గ్రామ శివారులో నిబంధనలకు విరుద్ధంగా సాకేత్ వెంచర్ ను ఏర్పాటు చేశారు.. గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో రోడ్డు నుండి 30 ఫీట్ల దూరంలో ఏర్పాటు చేయాలని నిబంధనను తుంగ లో తొక్కేస్తున్నారని విమర్శలు వచ్చిపడుతున్నాయి..గతంలో వెంచర్ అనుమతుల కొరకు పంచాయతీ కార్యదర్శితో చేతులు కలిపారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**

గ్రామ శివారులో ఏర్పాటు చేసిన సాకేత్ వెంచర్ లో కనీస నీటి సౌకర్యాలు కల్పించకుండా, అంతర్గత రోడ్లను సైతం నిబంధనలు పాటించని వారికి జిల్లా పట్టణ ప్రణాళిక అధికారి డీటీసీపీ అనుమతులు ఎలా వచ్చాయి అనేది ప్రశ్నార్థకంగా మారింది. కేటుగాళ్ళు అందమైన ప్రకటనలు ఆకర్షనీయమైన బ్రోచర్లతో అమాయక ప్రజలను నిండా ముంచుతున్నారు. వెంచర్ ఏర్పాటులో ప్రభుత్వ నిబంధనలు గాలికొదిలేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. జహీరాబాద్ ను స్మార్ట్ సిటీగా ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వ అధికారులకు మామూళ్ళ మత్తులో ముంచి ఇష్టనుసారంగా వెంచర్ లో ప్లాట్లను విక్రహించడానికి సిద్ధమయ్యారు. ప్లాట్లను త్వరితగతిన అమ్మడానికి కొనుగొలుదారులను ఆకర్షించడానికి సినియాక్టర్లతో వెంచర్ ను ప్రారంభిస్తున్నారు. ఆదాయం సమకుర్చుకుని ప్రజలు రూ. లక్షల్లో వెచ్చించి ప్లాట్లను కొనుగోలు చేస్తున్న వారిని ను నిండా ముంచడానికి పక్క ప్రణాళికలు వేశారు. వెంచర్లలో ప్రభుత్వ నిబంధనేమీ పాటించడం లేదు.

2లో

## హైడ్రా.. ఫ్లడ్ స్టడీ!



- హైదరాబాద్‌లో లోతట్టు ప్రాంతాల పరిశీలన
- వరద ప్రాంతాలు, అడ్డంకులు క్షేత్రస్థాయిలో గుర్తింపు
- స్వయంగా రంగంలోకి దిగిన కమిషనర్ రంగనాథ్
- డీఆర్ఎఫ్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తూనే కబ్జాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన

## అందరూ అందుబాటులో ఉండాలి

- అధికారులు సెలవులు రద్దు చేసుకోవాలి
- అత్యవసర సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం



2లో

## విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా?

### గురుకుల పాఠశాలలను పట్టించుకోరా?

- మాజీ మంత్రులు హరీశ్, జగదీశ్‌రెడ్డి మండిపాటు
- కొండభీమనపల్లి బీసీ బాలుర గురుకులం పరిశీలన
- 13 మందిని ఎలుకలు కొరికిన ఘటనపై ఆరా
- సమస్యలు తెలుసుకొని విద్యార్థులకు పరామర్శ

దేవరకొండరూరల్: రాష్ట్రంలో గురుకులాల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైనా పట్టించుకోరా? అని మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. విద్యార్థుల ప్రాణాలతో

2లో



## గాలిలో రైలు పట్టాలు..

- మహబూబాబాద్ జిల్లాలో వరదకు పలుచోట్ల దెబ్బతిన్న ట్రాక్‌లు
- కొట్టుకుపోయిన సిమెంట్ దిమ్మెలు, కంకరరాళ్లు
- రైల్వే సిబ్బంది, అధికారుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదాలు
- డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రంలో పలు రైళ్ల నిలిపివేత..

మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో నాలుగు చోట్ల రైల్వే లైన్లు దెబ్బతిన్నాయి. వరద తాకిడికి పట్టాల కింద సిమెంట్ దిమ్మెలు, కంకరరాళ్లు, మట్టి కొట్టుకుపోయి ఊయలలా పట్టాలు వేలాడుతున్న విషయాన్ని రైల్వే సిబ్బంది పసిగట్టడం.. అప్రమత్తమైన అధికారులు ఎక్కడిక క్కడ రైళ్లను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. మహబూబాబాద్ రూరల్ మండలం అయోధ్య పెద్ద చెరువు కట్ట తెగడంతో వరద నీరు ఉధృతంగా తాళ్లపూసపల్లి సమీపంలో రైల్వేట్రాక్ కిందినుంచి వెళ్లింది. దీంతో కొత్తగా వేస్తున్న విజయవాడ- సికింద్రాబాద్ లైన్‌తోపాటు, పాత లైన్ల కింద ఉన్న మట్టి, కంకర రాళ్లతోపాటు, సిమెంట్ దిమ్మెలు కూడా కొట్టుకుపోయాయి.

# రాయికోడ్ మండలంలో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు



(మొదటి పేజీ తరువాయి)

తాగునీటి సౌకర్యం లేకున్నా అంతర్గత రోడ్లను నామమాత్రంగా వేసి మాయమాటలు చెప్తూ లక్షలు గడిస్తూ అమాయక కొనుగోలు దారులను అడ్డంగా ముంచేస్తున్నారు. గ్రామ పంచాయతికి వెంచర్ లలో సరిపడా స్థలం కేటాయించకుండా డ్రైనేజి, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు లేకున్నా అంతా అయిపోయింది అన్ని బాగున్నాయి అంటూ ప్రచారం చేస్తూ అక్రమ వెంచర్లలో ప్లాట్లను విక్రయినిస్తున్న కేటుగాళ్ళు కోట్లు గడిస్తున్నారు. అప్పటివరకు నిద్ర మత్తులో ఉంటున్న అధికార యంత్రంగం ప్లాట్ల కొనుగోలు దారులపై తమ ప్రతాపం చూపిస్తున్నారు. అలాగే రాయికోడ్ మండలంలో అనుమతికి మించి భవనాలను నిర్మించడం, నిబంధనలు తుంగలో తొక్కి వెంచర్లలో ప్లాట్లను అడ్డతిడ్డంగా విక్రయించడం సర్వ సాధారణం అయిపోయింది. ప్లాట్లను కొనుగోలు చేసిన వారు మోసపోయామని తెరుకునే లోపు విక్రయించిన వారు రాష్ట్ర రాజధానిని దాటే ప్రయత్నాలు చేసే ఆస్కారం ఉంది.కొనుగోలు దారులు అధికారుల చుట్టూ ప్రదక్షణాలు చేయక ముందే వెంచర్ నిర్వాహకులను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు. జరుగుతున్న తతంగామంతా కళ్లారా చూస్తున్న గ్రామ పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్, తదితర శాఖల అధికారులు తామేం ఎరగనట్లు ప్రవర్తించడం కోసమెరుపు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఇతర అధికారులు స్మాట్ సిటీ జహీరాబాద్ సమీపంలో లోని జంబ్గి (కె) సమీపంలో లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వెంచర్ పై అక్రమ కట్టడాలపై కొరడా జులిపించి అమాయక ప్రజలు మోసపోకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు విన్నవిస్తున్నారు.

# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా?



(మొదటి పేజీ తరువాయి)

ఎన్నాళ్లు చెలగాటమాడుతారని నిలదీశారు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో రెండు రోజుల క్రితం 13 మంది విద్యార్థులను ఎలుకల కరిచిన విషయం తెలిసిందే. దీంతో మాజీ మంత్రి గంగుల కమలాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆదివారం వారు గురుకుల పాఠశాలను సందర్శించి ఎలుకలు కొరికిన విద్యార్థులను పరామర్శించారు. గురుకులంలో సమస్యలను తెలుసుకున్నారు. ఫ్యాన్లు పనిచేయక పోవడం వల్ల కిటికీలు తెరిచి పడుకుంటే వాటిలోంచి ఎలుకలు వస్తున్నాయని విద్యార్థులు తెలిపారు. కిటికీలకు దోమ తెరలు లేక నిద్రకూడా సరిగా పోతలేమని వివరించారు. రగ్గులు, ట్రాక్ సూట్లు, కాస్మోటిక్ చార్జీలను ఇంతవరకు ఇవ్వలేదని వాపోయారు. భోజనం ఎలా ఉన్నదని 9వ తరగతి విద్యార్థిని అడుగగా గతంలో రైస్ బాగుండేదని, ఇప్పుడు బాగోలేదని తెలిపాడు. బాత్‌రూమ్ డోర్లు సరిగా లేవని, విద్యుత్తు పోయినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి హెల్త్‌సూపర్‌వైజర్‌ను అడుగగా, మందులు మాత్రమే ఇస్తామని, ఇంజెక్షన్స్ తమ వద్ద ఉండవని చెప్పారు. పాము, తేలు కాటుకు సంబంధించి యాంటీవీనమ్ ఇంజెక్షన్స్ కూడా తమ వద్ద లేవని, దగ్గర్లోని తూర్పుపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్తానని ఆమె తెలిపారు. పాఠశాల చుట్టూ చెట్లు, పొదలు ఉన్నందున పాములు, తేళ్లు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నదని, యాంటీవీనమ్ ఇంజెక్షన్స్‌ను అందుబాటులో ఉంచడంపైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నదని మాజీ మంత్రులు మండిపడ్డారు. విద్యార్థులను పరామర్శించినవారిలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, గాదరి కిశోర్ కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి ఉన్నారు. తొమ్మిది నెలల నుంచి గురుకులాలను పట్టించునే నాథుడే లేడని, కేసీఆర్ హయాంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దిన గురుకులాలు కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. గురుకులాలను పట్టించుకోకుండా, ఇంత వరకు ఆ శాఖకు మంత్రిని నియమించకుండా సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, ఆయనకు హైదరాబాద్, ఢిల్లీ చక్కర్లు కొట్టేందుకే సమయం సరిపోతున్నదని మండిపడ్డారు. బోధనోపాధ్యాయులకు సమయానికి జీతాలు అందడం లేదని, వంట చేసేవారికి జీతాలు లేవని, కరెంట్ బిల్లులు, అద్దె బిల్లులు రాక గురుకులాల పరిస్థితి దయనీయంగా మారిందని తెలిపారు.

ప్రభుత్వం మొద్దునిద్ర : గంగుల కమలాకర్

కేసీఆర్ హయాంలోనే గురుకులాలను బలోపేతం చేసి నాణ్యమైన విద్యను అందించారని, 9 నెలల పాలనలో గురుకులాల పరిస్థితిపై ప్రభుత్వం ఒక్క సమీక్ష కూడా పెట్టలేదని గంగుల కమలాకర్ తెలిపారు. విద్యార్థులు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో మునిగిపోయిందని విమర్శించారు.



# పోటెత్తిన కృష్ణమ్మ

**ప్రకాశం బ్యారేజీకి 10.25 లక్షల క్యూసెక్కుల రాక**

**సాగర్ వద్ద ఉధృతంగా వరద ప్రవాహం**

కృష్ణా నది పోటెత్తి ప్రవహిస్తోంది. నాగార్జున సాగర్ రేడియల్ క్రస్ట్ గేట్ల నుంచి వరద దిగువకు ఉధృతంగా కొనసాగుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరదను బట్టి సాగర్ జలాశయం నుంచి 5 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని కృష్ణా నదిలోకి విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి ఆదివారం సాయంత్రం 10 క్రస్ట్‌గేట్ల ద్వారా స్పిల్‌వే మీదుగా 4,06,242 క్యూసెక్కులు.. కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 68,063 క్యూసెక్కులు కలిపి 4,74,205 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయానికి 4,20,280 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా.. క్రస్ట్ గేట్ల ద్వారా స్పిల్‌వే మీదుగా 4,97,524 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 12,261 క్యూసెక్కులు కలిపి దిగువ కృష్ణాలోకి 5,09,785 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వరద తీవ్రత ఎక్కువగా ఉండటం, ఈదురు గాలులకు అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతుండటంతో నాగార్జున కొండకు వెళ్లే లాంచీలను శని, ఆదివారాలు నిలిపివేశారు. దీంతో పర్యాటకులు నిరాశకు గురయ్యారు. వరద ఉధృతి తగ్గి, గాలులు తగ్గితే లాంచీలను నడుపుతామని, పర్యాటకుల భద్రత దృష్ట్యా లాంచీలను నిలిపి వేసినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

# అందరూ అందుబాటులో ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)





హైదరాబాద్: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, పురపాలక, విద్యుత్, పంచాయతీరాజ్, హైడ్రా, నీటిపారుదల శాఖల అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలపై ఆదివారం ఆయన అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, దామోదర రాజనరసింహ, జూపల్లి కృష్ణా రావుతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీలు, రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపల్ అధికారులు 24 గంటలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అధికారులెవరూ సెలవులు పెట్టొద్దని, సెలవులు పెట్టిన వారు వెంటనే రద్దు చేసుకుని సహాయక చర్యల్లో నిమగ్నం కావాలని కోరారు. అత్యవసర సేవల శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి నిరంతరం సమీక్షిస్తుండాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని సీఎం కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ అవసరం వచ్చినా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్థానికంగా ఉంటూ సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. కాంగ్రెస్ కార్యకర్తలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. రాష్ట్రంలో వర్షాలు, వరద పరిస్థితులు, వాటితో జరిగిన నష్టాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆరా తీశారు. ఆదివారం రాత్రి సీఎం రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు జిల్లాల్లో భారీ వర్షం, వరదతో వాటిల్లిన నష్టాన్ని ప్రధానికి సీఎం రేవంత్ వివరించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా, ప్రాణ నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తక్షణ సహాయక చర్యలను, జాగ్రత్తలను తెలియజేశారు. ఖమ్మం జిల్లాలో ఎక్కువ నష్టం సంభవించిందని ప్రధానికి వివరించారు. ప్రాణ నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించినందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రధాని అభినందించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సేవలు అందించే హెలికాప్టర్లను పంపిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం తరపున అవసరమైన సాయం అందిస్తామన్నారు. కాగా, రాష్ట్రంలో పెద్ద ఎత్తున వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పార్టీ కార్యకర్తలందరూ అప్రమత్తంగా ఉండి ప్రజలకు రక్షణగా నిలవాలని టీపీసీసీ కోరింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు.ఆదివారం రాత్రి సీఎం ఎ.రేవంత్‌రెడ్డికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఫోన్ చేశారు. వర్షాలు, వరదల పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్న ఆయన అవసరమైన తక్షణ సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.



# హైడ్రా.. ఫ్లడ్ స్టడీ!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: భాగ్యనగరంలో శని, ఆదివారాల్లో కురిసిన భారీ వర్షాలతో నీట మునిగిన ప్రాంతాలను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పరిశీలించింది. వరద ప్రభావిత ప్రాంతాలు, అక్కడి పరిస్థితులు, అడ్డంకులను క్షేత్రస్థాయిలో గుర్తించింది. చెరువులు, నాలాల కబ్జా వల్ల కలిగే ఇబ్బందులను ఆయా ప్రాంతాల్లో నివసించే వారికి వివరించే ప్రయత్నం చేసింది. జీహెచ్ఎంసీలో అంతర్భాగంగా ఉన్న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్)ను వేరు చేయడంతోపాటు చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతను అప్పగిస్తూ ప్రభుత్వం హైడ్రాకు రూపమిచ్చింది. ఈ మేరకు జూలై 19న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాతి రోజే హైడ్రా కమిషనర్‌గా ఏవీ రంగనాథ్ బాధ్యతలు స్వీకరించారు. వెంటనే చెరువుల ఆక్రమణలపై దృష్టిపెట్టి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో అక్రమంగా నిర్మించిన భవనాల కూల్చివేతల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అయితే గత 40 రోజుల్లో నగరంలో పలుమార్లు వర్షం కురిసినా శని, ఆదివారాల మాదిరిగా ముసురుపట్టి వివిధ ప్రాంతాలు మునకేసే పరిస్థితి కనిపించలేదు. ఈ రెండు రోజుల వర్షాలతో నగరంలోని అనేక ప్రాంతాల్లో జనజీవనం స్తంభించడంతోపాటు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొన్నిచోట్ల ఇళ్లలోకి వరద ప్రవేశించింది. రోడ్లపై భారీగా వర్షపునీరు నిలిచిపోవడంతో పలుచోట్ల వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది.

**షేక్‌పేట, టోలిచౌకి, బేగంపేటలలో పర్యటిస్తూ.**


ఈ పరిణామాల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ రంగంలోకి దిగారు. శని, ఆదివారాల్లో అనేక ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. షేక్‌పేట, టోలిచౌకి, బేగంపేట తదితర ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. నీళ్లు నిండిన రహదారులు, కాలనీల్లో తిరుగుతూ ఓపక్క డీఆర్ఎఫ్ సహాయ చర్యలను పర్యవేక్షిస్తూనే మరోపక్క ఆ ముంపునకు కారణాలను వారికి వివరించారు. చెరువులు, నాలాల కబ్జాల వల్లే ఈ విపత్కర పరిస్థితులు వస్తున్నాయని, దీని ప్రభావం కబ్జా చేసిన వారి కంటే ఎక్కువగా సామాన్యులపై ఉంటోందని చెప్పారు. ఎవరికి వారు బాధ్యతగా మెలిగేలా, కబ్జాలు, ఆక్రమణలపై వారు ఫిర్యాదు చేసేలా వారిని ప్రోత్సహించారు. నగరంలో గతంలో వర్షాలు కురిసిన సందర్భంలోనూ రంగనాథ్ క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. అయితే అప్పట్లో జీహెచ్ఎంసీ ఈవీడీఎం (ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్) డైరెక్టర్‌గా వరద సహాయక చర్యలను పర్యవేక్షించారు. అందులో భాగంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న అక్రమ నిర్మాణాలపైకి బుల్డోజర్లను కూడా ప్రయోగించారు. తాజాగా ఆయన హైడ్రా పగ్గాలు చేపట్టగా ఓ వర్గానికి చెందిన వారు ఆ సంస్థ చర్యలపై దుష్ప్రచారం ప్రారంభించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మాణాలు ఉన్నా ఇబ్బందుల్లేవని... కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ప్రభుత్వం హైడ్రాను ప్రయోగిస్తోందని ఆరోపించారు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న ఆయన శని, ఆదివారాల్లో క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా ఆ వర్గాల వాదన నిజం కాదని నిరూపించే ప్రయత్నం చేశారు.

# గాలిలో రైలు పట్టాలు..

(మొదటి పేజీ తరువాయి)

దీంతో ఆరు నుంచి పది అడుగుల మేరకు గొయ్యిపడి పట్టాలు గాలిలో వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. అదేవిధంగా కేసముద్రం విలేజీ పెద్ద చెరువు, దామర చెరువు, ఇంటికన్నె చెరువుల వరదతో ఇంటికన్నె, కేసముద్రం మధ్యలో వరద తీవ్రత పెరిగి ట్రాక్ అడుగు భాగం అంతా కొట్టుకుపోయింది. దీంతో ఇంటికన్నె%-%కేసముద్రం మధ్య 200 మీటర్ల మేర, తాళ్లపూసపల్లి%-%మహబూబాబాద్ మధ్యలో ఒక చోట 50 మీటర్లు, మరోచోట 10 మీటర్ల మేరకు పట్టాల కింద మట్టి కొట్టుకుపోయి ట్రాక్ తీవ్రంగా దెబ్బతిన్నది. అదేవిధంగా నెక్కొండ%-% వరంగల్ మధ్య రెండు మీటర్ల మేర గొయ్యి పడింది. ట్రాక్‌లు దెబ్బతిన్న విషయాన్ని ముందుగానే గుర్తించిన అధికారులు కేసముద్రంలో సంఘమిత్ర రెండు రైళ్లు, మహబూబాబాద్‌లో సింహపురి, మచిలీపట్నం, డోర్నకల్‌లో పద్మావతి, అప్, డౌన్ రెండు గౌతమి రైళ్లు నిలిపి వేయడంతో సుమారు పదివేలకు పైగా ప్రయాణికులు ఒక్కసారిగా మూడు స్టేషన్‌లలో దిగారు. రైళ్లు ఎప్పుడు వెళ్తాయో తెలియకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. కొందరు ప్రైవేట్ వాహనాలలో వెళ్లగా, మరికొందరు లాడ్జీలు తీసుకొని ఉన్నారు. ఎటూ వెళ్లలేని వారు స్టేషన్లలోనే ఉండటంతో మహబూబాబాద్, కేసముద్రం, డోర్నకల్ ప్రాంతాల ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు వారికి పండ్లు, బిస్కెట్లు, టిఫిన్, మధ్యాహ్న భోజనం, మంచినీరు, మందులు అందజేశారు.

# అమిత్‌షా ఆదేశాలతో రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు



హైదరాబాద్: తెలంగాణలో భారీ వర్షాలు, ముఖ్యంగా ఖమ్మం జిల్లా వరద పరిస్థితిని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దృష్టికి ఆ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీసుకెళ్లారు. ఖమ్మం జిల్లాలో 110 గ్రామాలు ముంపునకు గురవడంతోపాటు పట్టణంలోని ప్రకాశ్ నగర్ గుట్టపై 9 మంది, పాలేరు అజ్మీరాతండ గుట్టపైన 68 మంది, పట్టణంలోని ఇతర భవనాలపై 42 మంది చిక్కుకున్న విషయాన్ని అమిత్ షాకు వివరించారు. దీంతో తెలంగాణలో ప్రాణ నష్టం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఎన్డీఆర్ఎఫ్‌ను అమిత్‌షా ఆదేశించారు. చెన్నై, వైజాగ్, అసోం నుంచి 3 చొప్పున మొత్తం 9 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను తెలంగాణకు పంపుతున్నట్లు అమిత్‌షా తెలిపారు. షా ఆదేశాల తర్వాత ఎన్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులతో బండి సంజయ్ మాట్లాడారు.





# దంచికొట్టిన వాన, తడిసిముద్దయిన సంగారెడ్డి

## 24 గంటలుగా కుండపోత ● పొంగిపొర్లుతున్న చెరువులు కుంటలు

- నీట మునిగిన పంట పొలాలు ● నిమిషం వదలని వరుణుడు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు పలు ప్రాంతాలకు నిలిచిన రాకపోకలు రిజర్వాయర్లు, చెరువులు, కుంటలకు జలకళ
- వాహన రాకపోకలకు ఇబ్బందులు అన్నదాతల్లో ఆనందం
- రహదారులపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- నీటితో నిండిపోయిన సంగారెడ్డి లోని పలు ప్రాంతాలు



**సంగారెడ్డి, సెప్టెంబర్1 (డైలీ రిపోర్ట్):** బంగాళాఖా తాంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా కుంభపోత వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా రోడ్లపై ఇండ్లల్లోకి వర్షపు నీరు చేరింది. ఇప్పటికే సూర్యపేట జిల్లాలో వాతావరణశాఖ అధికారులు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ లోతట్టు ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హుజూర్ నగర్ నియోజక వర్గం వ్యాప్తం గా శుక్రవారం రాత్రి నుంచి కురిసిన కుండపోత వర్షానికి పలు ప్రాంతాలలో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు దిగువ ప్రాంతా నికి చేరుకుని రహదారులన్నీ జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. పలుచోట్ల వాగులు వంకలు పొంగిపొర్లి పలు ఇళ్లల్లోకి వర్షపు నీళ్లు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హుజూర్ నగర్ పట్టణంలో పూర్తి స్థాయిలో డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టకపోవడం, ప్రధాన రహదారిపై పక్కన ఉన్న షాపుల యజమానులు డ్రైనేజీలను పూడిక కూడా తీసేలా లేకుండా పూర్తిగా కప్పివేయడంతో డ్రైనేజీ లలో చెత్త పేరకపోయి వర్షపు నీరు రోడ్లపైనే నిలిచిపోయిన పరిస్తితి వచ్చింది. అంతే కాకుండా కొంత మంది చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, బజారు రోడ్లకంటే ఇంటి నిర్మాణాలు దిగువ భాగంలో ఉండటం వాళ్ళ ఇండ్లల్లోకి వర్షపు నీరు చేరి కొంత ఇబ్బందులు పడ్డారు. స్తానిక మున్సిపల్ అధికారులు అలె స్థాగా ఉండి వర్షపు నీరు నిలిచిన చోట సిబ్బంది, ప్రోక్లెన సహాయం తో డ్రెయినేజీలలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, రహదారిపై నిల్వఉన్న నీటిని తొలగించారు.సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షం కురుస్తోంది.

**జిల్లా వ్యాప్తంగా నమోదు అయిన వర్షపాతం నమోదు వివరాలు ఇలా ఉన్నాయి**

హత్నూర్ : 10.6 సెంటీమీటర్లు
అందోల్ : 10
పుల్ కాల్: 9.8
చౌటకూర్: 9.4
వట్టిపల్లి : 9.0
ఆర్ సి పురం: 8.5
పుల్కల్, జిన్నారం : 8.2
గుమ్మడిదల: 7.9
కొండాపూర్,కంది: 7.6
అమీన్ పూర్ : 7.4
పటాన్ చేరు, సుల్తాన్ పూర్, అల్గుల్ : 7.0
సంగారెడ్డి కలెక్టరేట్ : 6.7
మొగుడంపల్లి: 6.7
నిజాంపేట్: 6.6
కోహిర్, నల్లవల్లి : 6.5
మునిపల్లి: 6.4
మనూరు: 6.3
ఝు రా సంగం : 6.2
అత్యధిక వర్షపాతం నమోదు కాగా మిగతా ప్రాంతాలు సైతం భారీ వర్షం కురిసింది.

అత్యధికంగా హత్నూర్ లో 10.6, అందోల్, 10 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది, జిల్లాకు అధికారులు ఎల్లో అలర్ట్ ప్రకటించారు, జహీరాబాద్ కొత్తూరు (బి) నారింజ ప్రాజెక్టు పొంగిపొర్లుతోంది. వరద నీరు మొత్తం కర్ణాటక తరలిపోతుంది, ప్రాజెక్టు సామర్థ్యం 85 ఎంసిఎఫ్ టిలు, ఉండగా పూర్తి గా నిడింది. ఝురాసంగం మండలంలోని ఏడకులపల్లి చెరువు, జీర్లపల్లి, చిలేపల్లి వాగులు, చెరువులు పొంగిపొందుతున్నాయి,సంగారెడ్డి జిల్లా హత్నూర్ 10.6 సెంటిమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదు కాగా జహీరాబాద్ 3.3 సెంటీమీటర్ల అతి తక్కువ వర్షపాతం నమోదయింది. భారీ వర్షాలు కురుస్తున్న వేళ జిల్లా యంత్రాంగం కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 24 గంటలు పని చేస్తుందని వారు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడైనా ప్రజలు ఇబ్బందులు ఉంటే తక్షణమే 08455-276155 సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. రైతులు అత్యవసరమైతేనే పొలాల వద్దకు వెళ్లాలని సూచించారు. విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని, చెరువు, కుంటలు, వాగుల వద్దకు వెళ్ళొద్దని ప్రజలకు అధికారులు సూచించారు.




## మోకిలలో నీటమునిగిన లా పలోమా విల్లాస్

**శంకర్‌పల్లి: సెప్టెంబరు 01: (డైలీ రిపోర్ట్):** రాష్ట్రంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గేటెడ్ కమ్యూనిటీ విల్లాల్లోకి వరద పోటెత్తుతొంది. శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామంలోని 212 విల్లాల్లో సుమారు వెయ్యి మంది నివాసముంటున్న లా పలోమా కమ్యూనిటీలో వరద బీభత్సం సృష్టించింది.రెండేళ్ల క్రితం ఈ విల్లాల్లో ఈ పరిస్థితి నెలకొందని... మళ్లీ అదే పరిస్థితి పునరావృతమైందని ఆ కమ్యూనిటీలో నివసించే వారు చెబుతున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి విల్లాలు కొనుగోలు చేశామని, మా కమ్యూనిటీ నుంచి వరదనీటిని బయటకు పంపించే క్రమంలో గ్రామపంచాయతీ సహకరించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని వాపోతున్నారు.లా పలోమా కమ్యూనిటీ అధ్యక్షుడు రాజా చంద్ర మాట్లాడుతూ.. ఎగువన ఉన్న కమ్యూనిటీ నీటి ప్రవాహం కమ్యూనిటీలోకి వస్తోందని... నీటి ప్రవాహాన్ని బయటికి పంపించడానికి సరైన మార్గాలు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమస్యపై దృష్టి సారించి 1000 మందికి పైగా నివాసముంటున్న మా కమ్యూనిటీని ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, అధికారులకి విజ్ఞప్తి చేశారు.



## ప్రధాన రోడ్డుపై ఏర్పడిన నీటి ప్రవాహాన్ని తొలగించిన అధికారులు

**వాహనదారుల ప్రశంసలందుకున్న పోలీస్ మరియు పంచాయతీ రాజ్ అధికారులు**

**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 01:** (డైలీ రిపోర్ట్): శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ రెవిన్యూ లో శంకర్‌పల్లి హైదరాబాద్ ప్రధాన రోడ్డుపై భారీగా నీరు నిల్వ ఉండడంతో వాహనదారులకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మోకిల ఇన్స్పెక్టర్ వీరబాబు, సబ్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరావు మరియు వారి సిబ్బంది జన్వాడ గ్రామ పంచాయతీ సెక్రెటరీ ప్రభాకర్ మరియు మిర్జాగూడ పంచాయతీ ఉద్యోగి బసవరాజ్ వేగంగా స్పందించి వాహన దారులకు ఇబ్బంది లేకుండా రోడ్డుపై ఏర్పడిన నీటిని జెసిబి సహాయంతో దారి మళ్ళించారు. వేగంగా సమస్యను పరిష్కరించేందుకు ముందుకు వచ్చిన పోలీస్ సిబ్బందిని మరియు జన్వాడ పంచాయతీ సెక్రెటరీ ప్రభాకర్ మరియు మిర్జాగూడ పంచాయతీ ఉద్యోగి బస్వరాజు లను వాహనదారులు అభినందించారు. ప్రతి గ్రామంలో సమస్యలు ఏర్పడి నట్లయితే వెంటనే స్పందించాలని అధికారులను వారు కోరారు.





## శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ లో అన్ని ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగేటట్లు చర్యలు తీసుకోండి

**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 01: (డైలీ రిపోర్ట్):** రంగారెడ్డి జిల్లాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న శంకర్‌పల్లి మున్సిపాల్టీ, మండల పరిధిలో రవాణా సౌకర్యాలు మరింత సౌకర్యవంతంగా ఉండేందుకు పూర్తి సహకారం అందించాలని మండల, మున్సిపాలిటీ కి చెందిన బిజెపి నాయకులు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ఆదివారం నగరంలో కలిసి వినతి పత్రం పత్రం అందజేశారు. ముఖ్యంగా ఈ రైల్వే స్టేషన్ ద్వారా కంది ఐఐటీ విద్యార్థులకు, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు, రైల్వే రవాణా విషయంలో ఉన్న ఏకైక రైల్వే స్టేషన్ శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, రైల్వే అధికారులు స్పష్టమైన నిర్ణయం తీసుకునే విధంగా ప్రస్తుత సమస్యలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించాలని ఎంపీని వారు కోరారు. రైల్వే స్టేషన్ లో బీజాపూర్, వాడి ప్యాసింజర్, హుబ్లీ టు సికింద్రాబాద్, ఎల్ టీ టీ ట్రైన్ లకు శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ లో స్టాప్ లేకపోవడం వల్ల ప్రతినిత్యం రాకపోకలు నిర్వహించుకునే ఉద్యోగులు వ్యాపారులు విద్యార్థులు రోజువారి పనులు నిమిత్తం హైదరాబాద్ నగరంతో రాకపోకలు నిర్వహించుకునే అనేకమంది అనేక రకాల ఇబ్బందులను గురవుతున్నారని, ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను విన్న ఎంపీ వెంటనే రైల్వే జీఎంతో మాట్లాడి పైన సూచించిన ట్రైన్లు అన్ని కూడా శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ లో ఆగేటట్లు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని బిజెపి నాయకులు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు రాములు గౌడ్, మున్సిపాల్టీ భాజపా ఇన్చార్జ్ వాసుదేవ్, సీనియర్ నాయకులు పరమేశ్వర్ రెడ్డి, మండల భాజపా ఉపాధ్యక్షుడు వెంకటయ్య, మాజీ మండల అధ్యక్షులు నర్సింలు, నాయకులు బయన్న పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్న డిప్యూటీ సీఎం వీరాభిమాని పట్లోళ్ల నిఖిల్ రెడ్డి







శంకర్‌పల్లి: సెప్టెంబరు 01: (డైలీ రిపోర్ట్): నేడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపాల్టీకి చెందిన యువకుడు పట్లోళ్ల నిఖిల్ రెడ్డి హైదరాబాద్ లోని తాగం ఫౌండేషన్ లో చదువుతున్న ముగ్గురు అనాథ పిల్లలకు ఉచిత విద్యకు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. నిఖిల్ రెడ్డి.. పవన్ కళ్యాణ్ వీరాభిమాని. నిఖిల్ రెడ్డి లండన్ లో ఉద్యోగం చేస్తూ పేద పిల్లలకు సహాయం చేయడం గొప్ప విషయమని జనసేన కార్యకర్తలు, అభిమానులు తెలియజేశారు. పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను లండన్ లో ఘనంగా జరుపుతానని నిఖిల్ రెడ్డి తెలిపారు. పవన్ కళ్యాణ్ బాటలోనే నిఖిల్ రెడ్డి పయనిస్తున్నారని పలువురు ప్రశంసిస్తున్నారు.






# పాత్రికేయ ప్రస్థానం @24



**అక్షరం ఆగదు... లక్ష్యం మారదు...**

**సీనియర్ జర్నలిస్ట్ గడ్డం నిరంజన్ రావ్**

**రంగారెడ్డి బ్యూరో, (ప్రదీప్ కొమ్ముగురి)**



**డైలీ రిపోర్ట్ సెప్టెంబర్ 1 :** 1999 సెప్టెంబర్ లో పిన్న వయస్సులోనే (17 ఏళ్ల వయస్సు) ఆయన గురువు ముప్పవరం మధుసూదన్ రావు ఆశీర్వాదం, అయన ప్రోద్బలంతో ఆయన జర్నలిజం వృత్తిలో అడుగు పెట్టాను అన్నారు, మొదట హాబీగా మొదలు పెట్టిన జర్నలిజం తర్వత కాలంలో వృత్తిగా మారిందన్నారు.. ఆయన డైలీ రిపోర్ట్ రిపోర్టర్ తో చిట్ చాట్ చేశారు.ఆయన చదివింది ఇంగ్లీష్ మాధ్యమంలో తెలుగు అంతగా వచ్చేది కాదు, కానీ ఆయనకు జర్నలిజంలో ఓనమాలు నేర్పిన వ్యక్తి మధు , ఏపీ ఫైల్ ఆని అయన స్థాపించిన మార్జిన్ లో అక్షర ప్రస్థానం మొదలైంది.. 2002 సెప్టెంబర్ జర్నలిజం కీలక ఘట్టం మొదలయిందన్నారు. ప్రముఖ దినపత్రిక ఆంధ్రజ్యోతి దినపత్రిక పునర్ ప్రారంభిస్తున్నారని తెలిసి, మధు నన్ను సంగారెడ్డి కేంద్రంలో జరిగిన ఇంటర్వ్యూ పరీక్షకు పంపించారు అని తెలిపారు... ఏడు మంది రాసిన ఆ పరీక్షలో ఫైనల్ గా ఇద్దరు ఓరల్ ఇంటర్వ్యూ కు సెలెక్ట్ కావడం జరిగిందన్నారు... ఓరల్ ఇంటర్వ్యూ లో ప్రస్తుత ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్ , మాజీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ ఆయన్ను ఇంటర్వ్యూ చేశారు..భేల్ కమ్యూనిటీ సెంటర్ లో జరిగే రాష్ట్ర స్థాయి నాటిక, నాటకోత్సవం పైన ప్రశ్నలు అడిగారు... పుట్టింది పెరిగింది భేల్ కనుక నాకు అవగహన ఉండే, నా తోటి అభ్యర్థి కన్న నేను బాగ సమాధానం ఇవ్వడం, మా గురు రికమండేషన్ నన్ను రిపోర్టర్ గా ఉంది సెలెక్ట్ అయేందుకు తోడ్పడిందన్నారు.

**ఇక మిత్రుడు సాక్షి రిపోర్టర్ శ్రీనాథ్ విషయానికొస్తే...**

జర్నలిజం మొదటి ప్రయాణంలో నాతో వెన్నంటి ఉండే.. (ఇక మిగితా తోటి పాత్రికేయులు రాజిరెడ్డి , వార్త శ్రీను ధన్యవాదాలు తెలిపారు) హైదరాబాద్ పాలిటిక్స్, బిజినెస్, స్పోర్ట్స్ ఇలా అన్నీ రంగాల్లో నీకు మంచి అవగహన ఉంది అని నన్ను ప్రోత్సహించి నన్ను హైదరాబాద్ లో రిపోర్టింగ్ చేసేందుకు అవకాశం ఖాన్ సాబ్ ఇచ్చారు వారికి కృతజ్ఞతలు.. ఇక ఉద్యోగం లేకుండ కష్టకాలంలో నాకు టీవీ 5 లో ఉద్యోగా అవకాశం కల్పించి నా జర్నలిజం కెరీర్ కు రెండో ఇన్నింగ్స్ అందించిన టీవీ 5 రామకృష్ణ ధన్యవాదములు..

నా జర్నలిజం ప్రయాణంలో ఎన్నో అంశాలను అధ్యయనం చేసేందుకు, ఎన్నో పాఠాలను నేర్చుకునేందుకు సహకరించిన మారుతీ సాగర్ అన్నకు, కంబాల పల్లి కృష్ణ గారికి, ఆంధ్రజ్యోతి మడాం మధు అన్నకు, క్రైమ్ అనీల్ ల ప్రోత్సాహం ఎన్నటికి మరువలేనిది...

**జీవిత అనుభవాలు నేర్పిన మల్లేపల్లి లక్ష్మయ్య , పూజ్యులు పెద్దలు పాశం యాదగిరి కీ ప్రత్యేక ధన్యవాదాలు...**


జర్నలిజం కెరియర్ మొదల్లో నాకు దిశా మార్గ నిర్దేశం చేసిన ఏసీబీ సోమనారాయణ సింగ్ అన్నకు, ఏసిపి గంగాధర్ అన్నకు, డి.ఎస్.పి వేణుగోపాల్ రెడ్డి , డి.ఎస్.పి శంకర్ రెడ్డి గారికి కృతజ్ఞతలు.. మా టీవీ విజయ్ , మిత్రుడు బాలు అన్నకు, సంగారెడ్డి స్టాఫర్ గా కొనసాగిన రోజుల్లో నాతోటి పని చేసిన నా స్టాఫ్ ( ఏపీ 24X7 ఉమ్మడి మెదక్ జిల్లా సిబ్బందికి) అందరికీ పేరు పేరున ధన్యవాదాలు..) జర్నలిజం విలువలు కాపాడేందుకు, నిజాన్ని నిర్భయంగా చెప్పాలి అనే సంకల్పం తో ఎస్ టి వి సత్యమేవ జయతే యూ ట్యూబ్ ఛానల్ ప్రారంభించేందుకు సహకరించిన మిత్రుడు పాండుకు థాంక్స్.. ఏపీ 24 X 7 లో నాతోటి పనిచేసిన తెలంగాణా రాష్ట్ర జిల్లాల స్టాపర్లకు వారి నుండి నేను పొందిన ప్రేరణ ఎన్నటికీ మరువలేనిది.. (ముఖ్యంగా మా ఖమ్మం డాడీ నాగేందర్ ) నా ఈ అక్షర ప్రస్థానాన్ని అభినందించేందుకు ప్రత్యేకంగా నేడు ఇంటికీ విచ్చేసి నన్ను అభినందించిన ఎంఎల్ఏ గుడెం మహిపాల్ రెడ్డి గారికి ధన్యవాదాలు. అలాగే నా ఈ 24 ఏళ్ల ప్రస్థానానికి సహకరించిన నా కుటుంబ సభ్యులకు నా శత కోటి వందనాలు...

# నేడు విద్యా సంస్థలకు సెలవు ప్రజావాణి కార్యక్రమం రద్దు



జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి ,సెప్టెంబర్ 01, (డైలీ రిపోర్ట్):** భారీ వర్షాల నేపథ్యంలో ఈ నెల 2న నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దుతో పాటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో సోమవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, కుంటలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున అందరి శ్రేయస్సు దృశ్య, విద్యార్థిని, విద్యార్థులకు, ప్రజల కు ఎలాంటి ఇబ్బందులు కలగద్దు అనే ఉద్దేశంతో సెప్టెంబర్ 2 వ తేదీ సోమవారం, జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు, ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలు తెలిపారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. ప్రస్తుత భారీ వర్షాల దృష్ట్యా అత్యవసరం అయితే తప్ప ఎవరు బయటికి రాకూడదని, ప్రజల రక్షణ కొరకు అధికార యంత్రాంగం నిరంతరం శ్రమిస్తుందని, ప్రజలు భయాందోళన చెందవలసిన అవసరం లేదని, ప్రజలు అత్యవసర పరిస్థితులల్లో ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం. 08455-267155 ఏర్పాటు చేయడం జరిగిందని, అత్యవసర సేవలు నిమిత్తం ప్రజలు సంప్రదించవచ్చని తెలిపారు.



# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కౌన్సిలర్ బి.సంధ్యారాణి సంధ్యారాణి అశోక్ కుమార్**

**శంకర్పల్లి సెప్టెంబర్ 1: (డైలీ రిపోర్ట్):** వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఎవ్వరు దగ్గరకు వెళ్ళకూడదని అదేవిధంగా కల్వర్టులు, బ్రిడ్జిల దగ్గరకు వెళ్ళవద్దు, దాటడానికి ప్రయత్నం చేయవద్దు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకండి. పాత ఇల్లలో నివసిస్తున్న వారు తక్షణమే ఇంటిని విడిచి సమీపంలోని ప్రభుత్వ భవనాలు, పాఠశాలలో ఆశ్రయం పొందాలి. పాత గోడల దగ్గరకు వెళ్ళవద్దు. కరంటు స్తంభాలు, వైర్లను ముట్టుకోవద్దు. ముఖ్యంగా చిన్న పిల్లలను ఇంట్లోనే ఉంచండి, బయటకు రానివ్వద్దు మీ ప్రాంతాల్లో తడిసిన కరెంటు స్థంబాలకు దూరంగా ఉండాలని,అదేవిధంగా మన గ్రామంలో గాని పట్టణంలో గాని తెరిచి ఉన్న డ్రైనేజీ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

# ప్రజలకు కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలి: కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 01 : ఎన్నో అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్(%జశీఅస్త్రతీవం౦%) ప్రజలకు ఏం బాగు చేసిందో చెప్పాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆ పార్టీ నాయ కులను నిలదీశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటైనా పూర్తిస్థాయిలో అమలు చేశారా? అని ప్రశ్నించారు. ఏ మొఖం పెట్టుకొని కేసీఆర్ ప్రజల్లోకి వస్తారు? అని ప్రశ్నిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. అసలు అధికారంలో ఉండి ఏ ఘనకార్యం చేశారని మంత్రులు, కాంగ్రెస్ నేతలు ప్రజల్లో తిరుగుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.ఆదివారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి ఒక్కటైనా అమలు చేసిందా? అని ప్రశ్నించారు. రుణమాఫీ అని గొప్పులు చెప్పుకుంటున్న కాంగ్రెస్‌కు



సిగ్గుండాలన్నారు. ఒక్క గ్రామంలోనైనా పూర్తి స్థాయిలో అమలు చేశారా? అని ప్రశ్నించారు. ఏ గ్రామానికైనా వచ్చి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసినట్లు నిరూపిస్తారా? అని నిలదీశారు.రైతులను కాంగ్రెస్ ఘోరంగా మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు, 17 లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ సర్కారును ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ మంత్రులు, నాయకులు జాగ్రత్తగా మాట్లాడాలని హితవుపలికారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజలు తరిమికోట్టే రోజులు వస్తాయని హెచ్చరించారు.



# శ్రీశైలం వెళ్తున్నారా.. ఎస్పీ విజ్ఞప్తి ఇదే

నాగర్ కర్నూలు: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం వెళ్లే ప్రధాన రహదారి నల్లమల అటవీ ప్రాంతంలో అక్కడక్కడ డ్యామేజ్ అయింది. దీంతో వాహనాలు వెళ్ళడానికి అవకాశం లేకుండా భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, వివిధ జిల్లాల నుంచి వయా కల్వకుర్తి, అచ్చంపేట మీదుగా శ్రీశైలం వెళ్లే భక్తులు కొన్ని రోజులపాటు తాత్కాలికంగా తమ దర్శన కార్యక్రమాలను వాయిదా వేసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సూచించారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను వెల్దండ మండలం కోట్రా జంక్షన్ వద్ద, వంగూరు మండలం కొనేటిపురం టోల్ ప్లాజా దగ్గర ఆపివేయడం జగురుతుందని తెలిపారు. కాబట్టి శ్రీశైలం వెళ్లే భక్తులు, వాహనదారులు ఈ విషయంలో పోలీసువారికి సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. భారీ వర్షాలతో నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని నాగనులు కల్వర్ట్ దగ్గర వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. నీళ్లలో కొట్టుకుపోతున్న వ్యక్తిని పోలీస్ కానిస్టేబుల్స్ తకిఖాన్, రాము కాపాడారు. జిల్లాలోని కోడెర్‌లో భారీ వర్షానికి ఇంటి మిద్దె కూలిపో?యింది. ఇంటిలో ఎవ్వరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బిజినపల్లి మండలం లట్టుపల్లి సమీపంలో కేఎల్ఐ కాలువ తెగటంతో వందలాది ఎకరాల పంటలు నీట మునిగింది.

# హైదరాబాద్-విజయవాడ మధ్య నిలిచిన రాకపోకలు



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఎడతెరిపిలేకుండా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నందిగామ మండలం ఐతవరం వద్ద 65వ జాతీయ రహదారిపై వరద నీరు భారీగా చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్, విజయవాడ హైవేలో వచ్చేవారు తప్పనిసరిగా వరద ఉధృతిని గమనించి ప్రయాణించాలని అధికారులు సూచించారు. తెలంగాణ -ఏపీ సరిహద్దు రామాపురం వద్ద చిమిర్యాల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నల్లబండగూడెం వద్ద జాతీయ రహదారిపైకి నీరు చేరింది. దీంతో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాలువకు భారీ గండి పడింది. దాదాపు యాభై మీటర్ల మేర గండి పడటంతో వేల క్యూసెక్కుల నీరు వృధాగా పోతోంది. పంటల పొలాలు మునిగిపోయాయి. గండి పడ్డా కూడా ఘటనా స్థలానికి ఇరిగేషన్ అధికారులు రాలేదు. పలుచోట్ల సాగర్ ఎడమ లైనింగ్ దెబ్బతింది. గతంలోనే లైనింగ్, సాగర్ ఆధునికీకరణ కోసం వేల కోట్ల రూపాయల కేటాయింపు జరిగింది. కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా లైనింగ్ చేసి చేతులు దులుపుకున్నారు. పలుచోట్ల గండ్లు పడే ప్రమాదం ఉందని గతంలో అనేకసార్లు సాక్షి మీడియా హెచ్చరించింది. అయినా కూడా అధికారుల్లో చలనం లేదు. ఫలితంగా నడిగూడెం మండలంలో భారీ గండి పడింది.

# హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించండి

**బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్**



హైదరాబాద్: రాష్ట్రంలో పాలన గాడితప్పి ప్రజారోగ్యం పడకేసి తెలంగాణ మొత్తం విషజ్వరాల బారిన పడినందున.. వెంటనే ప్రభుత్వం హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను తెరపైకి తెచ్చిందని, కానీ దీనిద్వారా అసలైన సమస్యలను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో చెరువులను పరిరక్షించాల్సిందేనని, కానీ ఈ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని డిమాండ్ చేశారు. కబ్జాల వివరాలు బయట పెట్టాలని, ప్రజల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందన్నారు. దేవాదాయ భూములు, అసైన్డ్ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలు అన్ని అనుమతులు తీసుకుని కట్టుకున్నాక.. వాటిపై ప్రతాపం చూపొద్దన్నారు. ప్రజల్ని మభ్య పెట్టేందుకు రేవంత్ రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. రుణమాఫీ చేయలేదు.. తులం బంగారం లేదు.. నిరుద్యోగ భృతి ఇవ్వ లేదని ఎద్దేవా చేశారు. ఉచితాలు, హామీలు, గ్యారంటీల పేరుతో ఎన్నికలకు ముందు హామీలిచ్చి.. గద్దెనెక్కాక ప్రజలను గోస పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు, అవినీతి, అప్పుల్లో కూరుకుపోయి దివాలా తీస్తున్నాయని తెలిపారు. రాహుల్ గాంధీ కటాకట్ కటాకట్ డబ్బులు వేస్తామని చెప్పారు.